# నేడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక

## చేర్యాల సబ్ డివిజన్ పరిధిలో 4,679 మంది ఓటర్లు

- నాలుగు మండలాల్లో 4 పోలింగ్ కేంద్రాలు
- ఉదయం 8 నుంచి 4గంటల వరకు పోలింగ్
- ముగిసిన ప్రచారం, కేంద్రాల వద్ద 144 సెక్షన్




మద్దూరు పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో చేరుకున్న అధికారులు, సిబ్బంది

చేర్యాల, మే 26: వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సోమవారం జరుగనున్నది. సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం పరిధిలోకి వస్తుండడంతో ఈ ప్రాంతంలోని పట్టభద్రులు ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టభద్రుల ఉప ఎన్నిక ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4వరకు కొనసాగనున్నది. గ్రాడ్యుయేట్స్ ఓట్లు వేసేందుకు చేర్యాల మండల ప్రజాపరిషత్ పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్టలో ఒక్కొక్కటి చొప్పున పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. చేర్యాలలో 2,555 గ్రాడ్యుయేట్స్ ఓటర్లలో(1686 మంది పురుషులు, 869 మహిళలు), కొమురవెల్లిలో 678 ఓటర్లలో (447 మంది పురుషులు, 231 మంది మహిళలు), మద్దూరులో 935 మంది ఓటర్లలో (642 మంది పురుషులు, 293 మంది మహిళలు), ధూళిమిట్టలో 511 మంది ఓటర్లలో (346 మంది పురుషులు, 165 మంది మహిళ ఓటర్లు) ఉన్నారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి విద్యావంతుడైన ఏనుగుల రాకేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి చింతపండు నవీన్‌కుమార్, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పోటీలో ఉన్నారు. గ్రాడ్యుయేట్స్ బ్యాలెట్ పేపర్‌లో తమ అభ్యర్థులకు ప్రాధాన్యతను నెంబర్ల రూపంలో వేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ రెండు రోజుల క్రితం ఉప ఎన్నిక ఏర్పాట్లపై సిద్దిపేట జిల్లా కలెక్టర్, సీపీలతో పాటు హుస్నాబాద్ ఏసీపీ, చేర్యాల సీఐలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. నాలుగు మండలాల పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 8 నుంచి 4గంటల వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు జిల్లా పోలీస్ కమిషనర్ అనురాధ తెలిపారు. గ్రాడ్యుయేట్స్ కాకుండా పార్టీల నాయకులు గుంపులుగా కేంద్రాల వద్ద ఉండవద్దన్నారు. దీంతో పాటు ప్రతి పోలింగ్ కేంద్రం జియోట్యాగింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను పోలీస్‌శాఖ ఏర్పాటు చేసింది.

### ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

మిరుదొడ్డి, మే 26: మండలంలోని లింగుపల్లిలో 33/11 కేవీ విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాక్టర్, హార్వెస్టర్ వెళ్లే టప్పుడు ఇక్కట్లు తప్పడం లేదు. ఈ విషయాన్ని విద్యుత్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. విద్యుత్ అధికారులు స్పందించి కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ఉన్న వైర్లను చూపుతున్న మహిళా రైతు ముత్తవ్వ



### నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు

– సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ

సిద్దిపేట అర్బన్, మే 26 : దుకాణాల్లో ఏజెంట్లు, మధ్యవర్తుల ముసుగులో నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ ఆదివారం ప్రకటనలో హెచ్చరించారు. నకిలీ విత్తనాల రవాణా, విక్రయాలను అరికట్టేందుకు వ్యవసాయ, విత్తన కార్పొరేషన్, పోలీస్ బలగాలతో జాయింట్ టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందని.. వారంతా విధి నిర్వహణలో నిమగ్నమై ఉన్నారన్నారు. నకిలీ విత్తనాల విక్రయాల్లో గతంలో కేసులు నమోదైనా వారిపై నిఘా ఉంటుందని.. తరుచూ కేసులు నమోదైతే పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. గుర్తింపు పొందిన విత్తన దుకాణాల్లో విత్తనాలను కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. విత్తన డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలని.. ఎవరైనా ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల విత్తనాల పేరుతో నకిలీ విత్తనాలు అమ్మి రైతులను మోసం చేస్తే ఊపేక్షించేది లేదన్నారు. నకిలీ విత్తనాల సమస్యలను నియంత్రించేందుకు ఇప్పటికే ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి రాకుండా సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు సమాచార వ్యవస్థను పటిష్టం చేసినట్లు తెలిపారు. జిల్లా, పట్టణాలు, గ్రామాల్లో ఎవరైనా తక్కువ ధరకు పత్తి విత్తనాలు కానీ ఇంకా ఏవైనా విత్తనాలు కానీ ఇస్తామని మాయ మాటలు చెప్పి విక్రయించడానికి వచ్చిన వారి వివరాలను వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని.. లేదా డయల్ 100 కు కానీ లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712667100 కు, సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల సెల్: 8712667445, 8712667446, 8712667447 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు.

### రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

మద్దూరు(ధూళిమిట్ట), మే26: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఉమ్మడి మద్దూరు మండల బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి పాకాల కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యావంతుడైన రాకేశ్‌రెడ్డిని గెలిపిస్తే నిరుద్యోగ యువత పక్షాన శాసనమండలిలో పోరాటం చేస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీకి పట్టభద్రులు తమ ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

### 29న ఎంపీపీ ఎన్నిక

కొండపాక(కుకునూరుపల్లి), మే 26: కలెక్టర్ మనుచౌదరి ఆదేశాల మేరకు ఖాళీగా ఉన్న ఉమ్మడి కొండపాక ఎంపీపీ ఎన్నికను ఈ నెల29న ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కొండపాక మండలంలో మొత్తం 14 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా ఒకరు మృతిచెందారని, ప్రస్తుతం 13 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారని, చేతులెత్తే పద్ధతిలో ఎంపీపీ ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. గతంలో ఎంపీపీగా ఉన్న సుగుణపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ఆమెను తొలగించారు. అప్పటి నుంచి ఎంపీపీ స్థానం ఖాళీగా ఉన్నది.

### మట్టి స్నానం ఆరోగ్యానికి మేలు

సిద్దిపేట, మే 26: మట్టి స్నానం ఆరోగ్యానికి ఎంతో మేలని యోగా గురువు సిద్ధిరాములు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదియోగి పరమేశ్వర యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామూహిక మట్టి స్నానాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన యోగా గురువులు మనోహర్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

### గ్రామదేవతలకు బోనాలు

కొండపాక(కుకునూరుపల్లి), మే 26 : కొండపాక మండలంలోని బందారంలో బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అన్నికుల సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం గ్రామదేవతలకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అన్ని వీధుల గుండా మహిళలు బోనాలు ఎత్తుకొని శివసత్తుల పూనకాలు, పోతరాజుల ఆటపాటల మధ్య మహంకాళి, పోచమ్మలకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ముగుస్తాయని గ్రామస్తులు తెలిపారు.

### బెల్లి లలితక్కకు నివాళి

హుస్నాబాద్‌రూరల్, మే 26: మండలంలోని మీర్జాపూర్‌లో ఆదివారం బెల్లి లలితక్క 25వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం ప్రతినిధులు, పలు కుల సంఘాల ప్రతినిధులు ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం నియోజకవర్గ జేఏసీ కోఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్ మాట్లాడారు.కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఇల్లందుల లక్ష్మణ్‌గౌడ్, గొర్ల వీరన్నయాదవ్, మల్లం నరసింహ, రమేశ్, సంపత్, రాగుల శ్రీనివాస్, దిలీప్, సందెబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నేతలను సన్మానిస్తున్న గౌడ సంఘం ప్రతినిధులు

### బీఆర్ఎస్ నేతల పూజలు

మద్దూరు(ధూళిమిట్ట), మే 26: ధూళిమిట్ట మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న రేణుకా ఎల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక బీఆర్ఎస్ నేతలతో కలిసి బీఆర్ఎస్ ధూళిమిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలను గౌడ సంఘం ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాచగోని పద్మావెంకట్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు దుబ్బుడు దీపికావేణుగోపాల్ రెడ్డి, చొప్పరి వరలక్ష్మీసాగర్, నాచగోని పద్మాలక్ష్మణ్‌గౌడ్, రచ్చలక్ష్మయ్య పాల్గొన్నారు.

### మృతురాలి కుటుంబానికి బీఆర్ఎస్ అండ



మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మిరుదొడ్డి, మే 26: మిరుదొడ్డి టౌన్‌లో ఇటీవల గుడ్డొల్ల రాజవ్వ అనే మహిళ మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి ఆదివారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థిక సహాయంతో పాటు క్వింటాల్ బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ స్వామి, బీఆర్ఎస్ నాయకులు మల్లయ్య, ధర్మారం బాబు, మద్దెల చంద్రం, నర్సింహులు పాల్గొన్నారు.

### రేణుకాఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న అదనపు జేసీ



హుస్నాబాద్ శ్రీరేణుకాఎల్లమ్మతల్లిని దర్శించుకున్న అదనపు జేసీ శ్యామ్‌ప్రసాద్‌లాల్

హుస్నాబాద్ టౌన్, మే 26: హుస్నాబాద్ పట్టణంలోని శ్రీరేణుకాఎల్లమ్మ తల్లిని పెద్దపల్లి జిల్లా అదనపు జేసీ గాజుల శ్యామ్‌ప్రసాద్‌లాల్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. అదనపు జేసీకి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జేసీ దంపతులు అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ పూదరి లక్ష్మీనారాయణ, సభ్యులతో పాటు పలువురు జేసీ దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద నీటి సమస్య తీవ్రంగా ఉందని భక్తుల ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన జేసీ ఈరోజే బోరు వేయిస్తానని వారికి హామీ ఇవ్వడంతో ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులతో పాటు పలువురు పాల్గొన్నారు.



వర్గల్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న భక్తులు

### వాగ్దేవి నమోస్తుతే...

వర్గల్, మే26: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ సరస్వతీ మాత ఆలయంలో ఆదివారం మూలనక్షత్ర పూజలు వైభవంగా జరిగాయి.ఆలయవ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీయాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు అమ్మవారికి విశేష అభిషేకం నిర్వహించారు. లక్షపుష్పార్చన, చండీహోమం, కుంకుమార్చన చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. దైవ దర్శనం కోసం వచ్చిన భక్తులతో వర్గల్ క్షేత్ర పరిసరాలు కిటకిటలాడాయి. తీర్థప్రసాదాల స్వీకరణ అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

### హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



సిద్దిపేట పట్టణంలో శోభాయాత్రలో పాల్గొన్న హనుమన్ మాలధారులు


హుస్నాబాద్‌రూరల్, మే 26: మండలంలోని పొట్లపల్లిలోని హనుమాన్ ఆలయంలో ఆదివారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో శ్రీ రామ సహిత ఆంజనేయస్వామి హోమం, హనుమాన్ దీక్షాపరులకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కానుగుల మోహన్, బత్తిని రాజు, చంద్రారెడ్డి, ఎలుగూరి రమేశ్, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు, కొత్తకొండ రాజు పాల్గొన్నారు.

**హనుమాన్ దేవాలయంలో హోమం**

బెజ్జంకి, మే 26: మండలంలోని గాగిల్లాపూర్‌లోని పంచముఖ హనుమాన్ దేవాలయంలో ఆదివారం హనుమాన్ దీక్షాపరులు హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలిశ స్థాపన, నవగ్రహాల పూజ, పంచామృత అభిషేకం, పాలాభిషేకం చేశారు. అనంతరం హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లేశం, హనుమాన్ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

**హనుమంతుడిని పూజిస్తే అంతా శుభమే**

సిద్దిపేట, మే 26: భక్తిశ్రద్ధలతో హనుమంతుడిని పూజిస్తే అంతా శుభమే జరుగుతుందని హనుమన్ మాలదీక్ష గురుస్వామి అయిత చందు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శరబేశ్వర ఆలయం నుంచి 108 కలశాలతో హనుమన్ మాలధారులు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 108 కలశాలకు ప్రత్యేక పూజలు చేశారు.



బెజ్జంకి: హనుమాన్ దేవాలయంలో హోమంలో పాల్గొన్న దీక్షాపరులు

### 'మల్లన్న'ను దర్శించుకున్న భక్తులు



గంగరేగు చెట్టు వద్ద భక్తుల సందడి

చేర్యాల, మే 26: కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు సందడి చేశారు. సుమారు 20 వేల మందికి పైగా భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ ఈవో బాలాజీ తెలిపారు. శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడిబియ్యం, కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి మొక్కులు చెల్లించుకోవడంతో పాటు మరికొందరు భక్తులు స్వామి వారి నిత్య కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలతో అత్యంత భక్తిశ్రద్ధలతో బోనం తయారు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మరికొందరు రాతిగీరల వద్ద ప్రదక్షిణ, కోడెల స్తంభం వద్ద కోడెలు కట్టి పూజలు చేశారు. స్వామివారి దర్శనం కోసం క్షేత్రానికి వచ్చిన భక్తులకు ఏఈవోలు గంగా శ్రీనివాస్, బుద్ధిశ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు సేవలందించారు.

**పట్నం వేస్తే రూ.500 చెల్లించాల్సిందే**

మల్లన్న క్షేత్రంలో భక్తుల నుంచి కొందరు ఒగ్గు పూజారులు బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. భక్తుడు పట్నం వేసేందుకు ఆలయం నుంచి డబ్బులు చెల్లించి టికెట్లు కొనుగోలు చేసినప్పటికీ ఒగ్గు పూజారులు అదనంగా డబ్బులు వసూలు చేస్తుండడం గమనార్హం. స్వామి వారి ఉత్సవాలు ముగిసిన అనంతరం ఒగ్గు పూజారులు బ్యాచ్‌లు ఏర్పాటు చేసుకుని ఒక్కోవారం కొందరు విధులు నిర్వహిస్తూ భక్తుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారు. స్వామివారి క్షేత్రంలో ఏ ప్రదేశంలో(గదులు,మహామండపం, గంగరేగు చెట్టు) ఎన్ని పట్నాలు ఏ ఒగ్గు పూజారి వేశాడు, ఎన్ని డబ్బులు వచ్చాయి అని గ్రూపులో కొందరు సభ్యులు చిన్న డైరీలో దర్జాగా నమోదు చేసుకుంటున్నారు.భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామి వారి మొక్కు చెల్లించుకునేందుకు ఒగ్గు పూజారితో వేయించే పట్నం వద్ద కొందరు డబ్బులు డిమాండ్ చేయడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆలయ అధికారులు తగు విచారణ జరిపి పట్నం వేసే సమయంలో డబ్బులు డిమాండ్ చేసే పద్ధతిని నియంత్రించాలని పలువురు భక్తులు కోరుతున్నారు.



పట్నంపై భక్తుడి వద్ద వసూలు చేసిన రూ.500 నోటు

### అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలి



మాటిండ్లలో కూలిపోయిన చెట్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు

నారాయణరావుపేట, మే 26: నారాయణరావుపేట, లక్ష్మీదేవిపల్లి, మాటిండ్ల, ఇబ్రహీంపూర్, బంజేరుపల్లి, కోదండరావుపల్లి, గోపులాపూర్, జక్కాపూర్, మల్యాల, గుర్రాలగొంది గ్రామాల్లో శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో వర్షం ధాటికి విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు, ఇండ్లు, పశువుల పాకలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఆదివారం అధికారులు ఆయా గ్రామాలను సందర్శించి జరిగిన నష్టాన్ని అంచనా వేశారు. అదే విధంగా పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు సందర్శించి అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు.

### నేటి నుంచి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

సిద్దిపేట, మే 26: సిద్దిపేట పట్టణంలోని గౌరీ నీలకంఠేశ్వరఆలయ 33వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు నీలకంఠ సమాజం అధ్యక్షుడు గుండ్ల యోగేశ్వర్ తెలిపారు. సిద్దిపేట గౌరీ నీలకంఠేశ్వర ఆలయంలో ఆదివారం నీలకంఠం సమాజం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. సోమవారంగణపతి పూజతో ప్రారంభమైన వార్షికోత్సవ వేడుకలు బుధవారం జరిగే గౌరీ నీలకంఠేశ్వర స్వామి కల్యాణంతో ముగుస్తాయన్నారు.

### పెద్ద చెరువులో చేపల మృత్యువాత

మిరుదొడ్డి, మే 26: మండల కేంద్రమైన మిరుదొడ్డి శివారులోని పెద్ద చెరువులో చేపలు మృత్యువాత పడ్డాయి. భూగర్భ జలాలు వృద్ధి చెందాలనే ఉద్దేశంతోనే మూడేండ్ల నుంచి చెరువును తైబంధు చేయకుండా వ్యవసాయ పొలాలకు సాగు నీటిని విడుదల చేయలేదు. దీంతో పెద్ద చెరువులో నీళ్లు పుష్కలంగా ఉండడం మూలంగా మూడేండ్లుగా చేపలు పట్టడం వీలు కాలేదు. ఇదే క్రమంలో చెరువులో ఉన్న వివిధ రకాల చేపలు పెద్దగా పెరిగాయి. ఈ యేడు యాసంగిలో పెద్ద చెరువును తైబంధు చేసి వ్యవసాయ రంగానికి సాగునీటిని విడుదల చేశారు. చెరువులోని నీరు వరి పొలాలకు విడుదల చేయడంలో నీటి మట్టం తగ్గిపోయింది.వారం రోజుల క్రితం బెస్తవారు కొన్ని చేపల పట్టారు కానీ చెరువులో ఉన్న మిగతా చేపలకు ఆక్సిజన్ అందకనీటి శాతం తగ్గడం, కొద్దిపాటి నీటిలోని చేపలు క్రమంగా మృత్యువాత పడ్డాయి.



హుస్నాబాద్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు



కొండపాక(కుకునూరుపల్లి): ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

### అ'పూర్వ' సమ్మేళనం

హుస్నాబాద్ టౌన్, మే 26: హుస్నాబాద్ పట్టణంలో 1993–94 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఆహ్లాదంగా కొనసాగింది. స్థానిక శుభం గార్డెన్‌లో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి దాదాపు రెండువందల మంది విద్యార్థులు హాజరయ్యారు. తమకు చిన్నప్పుడు బోధించిన పలువురు ఉపాధ్యాయులను ఆప్యాయంగా ఆహ్వానించి వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పాత జ్ఞాపకాలను నెమరు వేసుకోవడమే కాకుండా వారి కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పలువురు పూర్వ విద్యార్థులు పాటలు, ఆటలు ఆడుతూ చిన్నపిల్లలుగా మారిపోయారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కాశబోయిన ఓదేలు, బంక చందు, కర్ర రవీందర్‌రెడ్డి, మ్యాన గోపి, బోయిని సంపత్, గంగం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కుకునూరుపల్లిలో ...**

కొండపాక(కుకునూరుపల్లి), మే 26 : కుకునూరుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999–2000 టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాలకు కుకునూరుపల్లి సమీపంలోని ఒక హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు సన్మానం చేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు షకీల్‌పాషా, లత, మహిపాల్‌రెడ్డి, కృష్ణ, భద్రయ్య, రవి, స్వామి, నర్సింహులు, కనకయ్య, సరిత, స్వప్న, సభిత, చంద్రం, చందు పాల్గొన్నారు.

**మద్దూరులో...**

మద్దూరు(ధూళిమిట్ట), మే26: మద్దూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006–07 టెన్త్ పూర్తి చేసిన విద్యార్థులు మండల కేంద్రంలోని తాజ్‌గార్డెన్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రజ్ఞాపూర్‌లో..**

గజ్వేల్, మే 26: ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1996–97బ్యాచ్‌కు టెన్త్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గౌరారంలోని హిల్ సెవన్‌లో నిర్వహించారు. పూర్వ ఉపాధ్యాయులు కొండల్‌రెడ్డి, రామచంద్రరావు, లక్ష్మణస్వామి, శంకర్, రాంరెడ్డి, కేశవరెడ్డి,కాశీనాథ్, జైపాల్‌రెడ్డి, మామిడి నర్సయ్యగౌడ్, రఘుపతిలను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

**గోవర్ధనగిరిలో..**

అక్కన్నపేట, మే 26: మండలంలోని గోవర్ధనగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2009–2010లో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలలో కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గురువులను పూలమాలలు, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్, సమ్మయ్య, చింతకింది శ్రీనివాస్, బాలకృష్ణ, రాజమల్లయ్య, సర్వన్‌నాయక్, పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, జాఫర్, మధు, శ్రీకాంత్, రమేశ్, సతీశ్, సంధ్య, కృష్ణవేణి పాల్గొన్నారు.



మద్దూరులో పూర్వవిద్యార్థుల సమ్మేళనం



గజ్వేల్: పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అక్కన్నపేట: గోవర్ధనగిరిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు